

# రోగాలు - అనురోగాలు

## - డా.కె.వివేకానంద మూర్తి



*(క్రిందటి సంచికనుంచి కొనసాగింపు)*




**సాయంత్రం** అలసిపోతోంది. చీకటి ముంచుకొచ్చే రోగంలా కమ్ముకుంటోంది. పిల్ల డాక్టర్లంతా దీపాలు వెలిగించి చీకటిని చెరిపేస్తున్నారు. పదును పాపారావుగారు చుట్ట వెలిగించి పొగలు విసురుతూ అన్నారు. 'అదీ విషయం, మైడియర్ యంగ్ డాక్టర్స్. మీరు తలుచుకుంటే సాధించలేనిది ఏదీ లేదు. సాధించమని చెప్పడానికే మీ చుట్టూ యీ అందమైన ప్రపంచం వుంది. బాగా లేట్ అవుతోంది. ఇక కదుల్దాం. మీకింకా యేవన్నా సందేహాలుంటే వచ్చి నన్ను అడగండి. ఆల్ ది బెస్ట్' అని సరుగుడు చెట్ల మధ్య సమావేశానికి ముగింపు వాక్యాలు పలికారు. అంతా లేచి కదిలారు. బాలరాజు, రేఖ కూడా లేచారు. రేఖ కారు వైపు కదిలింది. బాలరాజు రేఖతో అడుగులు కలిపాడు.

'ఏంచేద్దామని?' అడిగింది రేఖ.

'మీతో కారుదాకా వస్తాను. అప్పుడు ఆలోచిస్తాను.'

'నా వుద్దేశం మీరు పోస్ట్ గ్రాడ్యుయేషన్ చేద్దామనుకుంటున్నారా? అనుకుంటే యిక్కడా? ఫారిన్‌లోనా? లేక ఏవన్నా జాబ్‌లో చేరతారా?'

'ఏదీ కచ్చితంగా అనుకోలేదు. ఇంకొన్నాళ్లు పనిచేస్తూ కాస్త అనుభవం సంపాదించాలనుకుంటున్నాను.'

'దట్స్ నైస్.'

'మరి మీరు.'

'నేనూ మీలాగే అనుకుంటున్నాను.'

'ఎప్పుడూ అడగలేదు. మీ అమ్మగారు, నాన్నగారు -'

'నాకు అమ్మా, నాన్నా లేరు.'

బాలరాజు కొంచెం షాకయ్యాడు.

రేఖ చెప్పింది - 'ఫ్యూయియర్స్ క్రితం ఫ్లైట్ యాక్సిడెంట్‌లో పోయారు.'

'సారీ టు హియర్. నేను వూహించలేకపోయాను.'

'నాకు తోడబుట్టిన వాళ్లెవరూ లేరు. మావయ్య దగ్గర వుంటున్నాను. ఆయనా వొక్కడే పెళ్లి చేసుకోలేదు. తను డాక్టరు. సొంత హాస్పిటల్‌తో యెప్పుడూ బిజీగా వుంటాడు. నాకు తల్లీ తండ్రీ ఆయనే.'

'అలాగా'

'మీరు.'

'మా అమ్మా, నాన్నా బాగా పెద్దవారయిపోయారు. మా విలేజ్‌లోనే వుంటారు. ఇక్కడ వొక్కణ్నే ఫ్రెండ్స్‌తో వుంటున్నాను. అఫ్‌కోర్స్, యిప్పుడు ఫ్రెండ్స్ తలోచోటికీ వెళ్లిపోయారు. వొకడు తప్ప.'

'ఒక్కరే వున్నా తిన్నగానే వున్నారే'

'ఎక్కడ తిన్నగా వుండడం. మీ వెనకాల పడుతున్నానుగా.'

రేఖ కిలకిలా నవ్వింది. బాలరాజు పకపకా నవ్వాడు. రేఖ కళ్ళు ధగధగలాడాయి.

'ఎక్కడ మీ మావయ్య హాస్పిటల్?

'క్యూర్ హాస్పిటల్. మీకు తెలియదా?'

'ఓ. క్యూర్ హాస్పిటల్ తెలియకపోవడమేవిటి? వైజాగ్‌లో అతి పెద్ద ప్రైవేట్ హాస్పిటల్. ఆశీలు మెట్ట దగ్గర కదూ వుంది'

'యెస్. అదే'

ఇద్దరూ రేఖ కారు దగ్గరికి వచ్చారు.

'ఎక్కండి బాలూగారూ, మిమ్మల్ని డ్రాప్ చేస్తాను' అంది రేఖ.

'స్పేర్ టైర్ వుందిగా' - నవ్వుతూ కారెక్కాడు బాలరాజు.

'ఈసారి మనం ఆగంలెండి' కారులో కూర్చుంటూ అంది రేఖ.

'అవును - మనం ఆగం - మనకిప్పుడు తెలిసింది వొక్కటే - వేగం.'

'ఇన్నేళ్లూ వోపిగ్గా వుంటూ చదువుకున్నాం. ఇప్పుడు వేగం మనకి బలే బావుంటుంది కదూ.'

'అవును' అంటూ బాలరాజు ఆమె బుజాన్ని తాకాడు. ఆమె 'ఊఁ' అంది. తెలుగులో అచ్చులు అప్పుడప్పుడు మరీ తన్మయంగా వుంటాయనుకున్నాడు బాలరాజు.

కారు చాలా దూరం వెళ్తోంది.

'ఎక్కడికి వెళ్తున్నాం?' అడిగాడు బాలరాజు.

'డ్రాప్ చేస్తానన్నాను కదూ - సారీ. మర్చిపోయా. ఫర్లేదు. మా యింటికి వచ్చి కాఫీ తాగి వెళ్లండి. నేను మళ్లీ డ్రాప్ చేస్తాను.'

'సరే నేను మీ యిల్లు కూడా చూసినట్టు వుంటుంది.'

చెట్లు, కొట్లూ, రోడ్లు, యెడ్లూ దాటి కారు రేఖ ఇల్లు చేరింది. ఇల్లు బాగా యెత్తులో వుంది - విశాలమైన విశాఖపట్నం అంతా చూస్తున్నట్టు. గేటు దాటి ఆవరణలోకి ప్రవేశించగానే అటూ యిటూ యెనలేని వృక్ష సంపద, యెన్నో పూల మొక్కలు. ఇంటి సంపదను హరితాలన్ని సంపన్న భరితంగా చూపిస్తున్నాయి.

రాణీగారు రాగానే రాజభటులు వచ్చి వినయాన్ని ప్రదర్శిస్తున్నట్టు అటునుంచీ యిటు నించీ పనివాళ్లు వొంగి వొంగి కదిలారు. కండలు తిరిగిన మనిషి వొకడు వచ్చి కారు తలుపు తీశాడు. రేఖ, బాలరాజు కారు దిగారు. తలెత్తి చూసిన బాలరాజు యిది ఇల్లు కాదు. భవంతి అనుకున్నాడు. ఇద్దరూ లోపలికి నడిచారు. గోడలు ఖరీదైన తైల వర్ణచిత్రాలను తగుల్చుకుని తాము గొప్పింటి గోడలమని చెబుతున్నాయి. సీలింగు ఆకాశంలా బాగా యెత్తుగా వుంది. ఒక షాండ్లియర్ దేదీప్యమానంగా వెలుగుతూ మెరుస్తూ విర్రవీగుతోంది.

'ఇదే మా యిల్లు - కూర్చోండి. యిప్పుడే వస్తా' అని రేఖ, బాలరాజుని కూర్చోమని చెప్పి లోపలికి వెళ్లింది. బాలరాజు సోఫాలో కూర్చోగానే అతనికి సోఫియా లారెన్ తొడమీద కూర్చున్నట్టు అనిపించింది. ఇంతలో వంట మనిషి, వొంటి మనిషి కాదు - కడుపుతో వుంది - ప్లేట్‌లో పకోడీలు తీసుకువచ్చి టీపాయ్ మీద పెట్టి వెళ్లింది. రేఖ రెండు కాఫీ కప్పులు ట్రేలో పెట్టుకుని తీసుకొచ్చి 'కాఫీ తీసుకోండి' అని వొక కాఫీ నిండిన కప్పు బాలరాజుకిచ్చి, తనొక కప్పు తీసుకుని కూర్చుంది.

'మీ యిల్లు చాలా బాగుంది' అన్నాడు బాలరాజు కాఫీ సిప్ చేస్తూ.

'థాంక్యూ. ఎప్పుడూ యిలా క్వయిట్‌గానే వుంటుంది. మావయ్యని పరిచయం చేద్దామనుకున్నాను. కానీ యింకా వచ్చినట్టులేదు. ఇంత పెద్దింట్లో ఎవరేనా వచ్చినా వెళ్లినా కూడా తెలియదు. అందుకే యింట్లో మనుషులకంటే యిల్లు చూసే మనుషులే యెక్కువ.' నవ్వుతూ చెప్పింది రేఖ.

మళ్లీ అంది. 'కాఫీ తాగండి యిల్లు చూపిస్తాను.'

'లేదు. మరోసారి వచ్చినప్పుడు చూస్తాను. నాకోసం మేష్టారు వస్తానన్నారు. త్వరగా బైల్దేరుతాను.'

'మేష్టారేవిటీ?'

'మేష్టారంటే ప్రైవేటు మేష్టారు కాదు. హిస్టరీ శర్మగారు. నా వెల్ విషర్. మహా జ్ఞాని.'

'అలాగా. అయితే ఆయన్ని నేను తప్పకుండా చూడాలి.'

'ష్యూర్. పరిచయం చేస్తాను.'

'ఇన్నేళ్లు మనం కలుస్తూనే వున్నాం కానీ యిప్పటిదాకా కలిసి కాఫీ తాగడమే కుదర్లేదు.' అంది రేఖ.

'కలిసి యిలా యిష్టంగా మాట్లాడుకోవడం కూడా యీ మధ్యేగా మొదలైంది.'

'అఫ్‌కోర్స్. మనకిప్పుడు బోలెడంత టైము. దేనికీ కొదవుండదు.'

'అవును రేఖాజీ'

'ఇక మీరు నన్ను జీ, గారు అనకండి. రేఖ అంటే చాలు. అలాగే బాగుంటుంది.'

'అయితే నన్ను బాలరాజుగారూ కూడా అనొద్దు.'

'బాలూ' అంటాను.

'అవును. అలాగే బాగుంటుంది.'

రేఖ బాలరాజుని మెరిసే కళ్లతో చూసింది.

బాలరాజు ఆమె కళ్లనే చూస్తూ వుండిపోయాడు. 'పకోడీ తిన్నారా?' అడిగింది.

'ఒకటి తిన్నా చాలు. బాగుంది. మరి కదుల్దామా?' అన్నాడు కాఫీ తాగడం పూర్తి చేసి బాలరాజు.

'ఓకె. అయితే బైల్దేరదాం' అంటూ రేఖ లేచింది.

ఇద్దరూ హాలు విడిచి, కారువేపు కదిలారు.

కాసేపట్లో కారు బాచిలర్స్ డెన్ చేరింది.

నల్లతంబి కనిపించాడు. 'శర్మగారొచ్చారా?' అని అడిగాడు బాలరాజు.

'యింకా నేదు సార్' అని చెప్పాడు నల్లతంబి.

'ఇతను మా కుక్. పేరు నల్లతంబి. ఇంకా మేష్టారు రాలేదుట. పైకెళ్లి వెయిట్ చేద్దామా.'

'నో - బాగా లేటయింది. ఇంకోసారి. నైస్ మీటింగ్ యూ నల్లతంబీ' అంది రేఖ.

'సరే మరి' కారు దిగుతూ అన్నాడు బాలరాజు.

'కాఫీ బాగుంది. కలిసి కాఫీ తాగడం యింకా బాగుంది రేఖా.'

'థాంక్యూ బాలూ - యు మేడ్ మై డే' నవ్వింది.

'నవస్కారవమ్మా' అని వెనక్కి నడిచాడు నల్లతంబి.'

రేఖకు గుడ్‌నైట్ చెప్పి బాలరాజు తన రూమ్‌కి కదిలాడు.

రేఖ కారు వెనక్కి తిప్పుకుని మధురోహల్తో యింటివేపు కదిలింది. కాసేప్పటికి హిస్టరీ శర్మగారు, పాహియాన్ వచ్చి బాలరాజుని బాచిలర్స్ డెన్ బాల్కనీ మీద కలిశారు. ఫుడ్ రెడీ చేస్తానంటూ నల్లతంబి కిచెన్‌లోకి వెళ్లాడు. తానీషా వస్తాడో లేదో వాళ్లకి తెలియదు. తానీషాకీ తెలియదు. అతనింకా హసీనా బేగంతో మాట్లాడుతూనే వున్నాడు.

*( కొనసాగింపు వచ్చేనెలలో)*

Post your comments

